సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం ; 22 ; జూలై ; 2024



గర్భిణికి తప్పిన ప్రాణాపాయం
పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి సకాలంలో తరలించి ప్రాణాపాయం నుంచి 108 సిబ్బంది కాపాడారు. 8లో



ప్రమాదస్థాయికి జలాశయాలు
జలవిద్యుత్‌లో కీలకమైన డుడుమ, సీలేరు జలాశయాల్లో భారీగా వరదనీరు చేరడంతో నీటిమట్టాలు ప్రమాదస్థాయికి చేరాయి. 8లో



పూర్తిగా మునిగిన ఆలయం
గోదావరి వరద ఉధృతికి దేవీపట్నం మండలంలోని గండిపోసమ్మ ఆలయం పూర్తిగా నీటమునిగింది.

న్యూస్‌రీల్

వరద లాంచీలు ఎక్కడ?



కూనవరం వంతెనకు పరిమితమైన వరద సహాయక లాంచీలు

చింతూరు: వరద ఉధృతి పెరుగుతున్నా బాధిత కుటుంబాలను తరలించేందుకు ఇప్పటివరకు చింతూరు మండలానికి లాంచీలు రాకపోవడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు మండలానికి రెండేసి చొప్పున లాంచీలు ఏర్పాటు చేశామని చెబుతున్నా ఆదివారం రాత్రి వరకు ఇక్కడికి ఒక్క లాంచీ కూడా రాలేదు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని, గర్భిణులను పడవల ద్వారా తరలిస్తున్నారు.దీనిపై చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్యను వివరణ కోరగా ఆదివారం సాయంత్రానికి లాంచీలు చింతూరు వచ్చేలా ఆదేశించామని తెలిపారు.

విద్యాసంస్థలకు సెలవుల పొడిగింపు
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు

సాక్షి,పాడేరు: జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో విద్యాసంస్థలకు సెలవులు పొడిగిస్తున్నట్టు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 22 మండలాల్లోని అన్ని యాజమాన్య విద్యాసంస్థలకు ఈనెల 22న కూడా సెలవు ప్రకటిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఈనెల 19,20 తేదీలలో రెండు రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చామన్నారు.అయితే చింతూరు డివిజన్ పరిధిలోని కూనవరం,ఎటపాక,చింతూరు,వి.ఆర్.పురం మండలాల్లో వరదల కారణంగా 22,23తేదీలు రెండు రోజుల పాటు అన్ని విద్యాసంస్థలకు సెలవు ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపవద్దని కలెక్టర్ సూచించారు.

మన్యంలో కొనసాగుతున్న వర్షాలు
- ఉధృతంగా వాగులు, గెడ్డలు



ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ



జి.మాడుగుల మండలం సంగులోయ బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తున్న కొండవాగు

సాక్షి,పాడేరు: మన్యంలో వర్షాలు కొనసాగుతున్నాయి. ప్రధాన గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పెదబయలు, పాడేరు మండలాల్లోని సరిహద్దు ప్రాంతంలో సుమారు వంద గ్రామాలకు నిలిచిపోయాయి.

జిల్లాలో 387 మి.మీ నమోదు

జిల్లాలో ఆదివారం 387 ఎంఎం వర్షపాతం నమోదైంది. ముంచంగిపుట్టులో 65.4,చింతూరులో 48.4, మారేడుమిల్లిలో 39.2, పెదబయలులో 37.4, అడ్డతీగలలో 25.2,కొయ్యూరులో 20.2, వీఆర్‌పురంలో 18.2, రంపచోడవరంలో 16.8, రాజవొమ్మంగిలో 15.8, ఎటపాక 15.6, కూనవరంలో 14.8, జి.కే.వీధిలో 12.8, వై.రామవరంలో 12.2, దేవీపట్నంలో 10.6, గంగవరంలో 10.2, పాడేరులో 6.2, డుంబ్రిగుడలో 5.4, అరకులోయలో 4.6, హుకుంపేటలో 3.2, జి.మాడుగులలో 2.4, అనంతగిరి 1.8, చింతపల్లిలో0.6 ఎంఎం వర్షం కురిసింది.



వీఆర్‌పురం మండలంలో వడ్డిగూడెం గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టడంతో పునరావాస ప్రాంతాలకు వెళ్తున్న బాధితులు



తాలిపేరు ప్రాజెక్టు నుంచి గోదావరి నదిలోకి విడుదల అవుతున్న వరదనీరు



ఎటపాక మండలం నందిగామలో పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న రైతులు



వీఆర్‌పురం మండలం రామవరం -ఏవీగుడెం వద్ద గ్రామస్తులను పడవలో తరలిస్తున్న పంచాయతీ కార్యదర్శి తాతారావు

గడప గడపలో వరద వేదన

- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీతో అలజడి
- ఆందోళనకు గురవుతున్న విలీన మండలాల ప్రజలు
- కూనవరం, వీఆర్ పురం మండలాల్లో చుట్టుముట్టుతున్న వరదనీరు
- ఇళ్లను విడిచి సామాన్లతో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్న బాధితులు

గోదావరి.. శబరి నదుల పరవళ్లు.. సిరులు పండించే భూములు.. సమృద్ధిగా ఆదాయం.. **చీకూచింత లేని** జీవనం.. ఇలా సాఫీగా **సాగిపోతున్న** విలీన మండలాల ప్రజల **జీవితాలను** ఉగ్రరూపం దాల్చుతున్న **గోదావరి,** శబరి నదులు కంటిమీద **కునుకులేకుం**డా చేస్తున్నాయి. ఆదివారం **రాత్రి** మొదటి ప్రమాద హెచ్చరిక **జారీ** వారిలో గుబులురేపింది. **ఉన్నఫళంగా** ఇళ్లను వదిలి తట్టాబుట్టా **సర్దుకుని** బతుకుజీవుడా అంటూ **సురక్షిత** ప్రాంతాలకు తరలివెళ్తున్నారు.

చింతూరు/కూనవరం/వీఆర్‌పురం/ఎటపాక/: భద్రాచలం వద్ద ఆదివారం రాత్రి 44 అడుగులకు గోదావరి నీటి మట్టం చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేయడంతో విలీన మండలాల్లో గుబులు నెలకొంది. రేపటికి మరింత ఉధృతి పెరిగే అవకాశం ఉందని కేంద్ర జలవనరులశాఖ అధికారులు హెచ్చరికలతో భయాందోళన నెలకొంది. ఈ క్రమంలో శబరి, గోదావరి సంగమ ప్రాంతాలైన కూనవరం, వీఆర్‌పురం మండలాల ప్రజలు అప్రమత్తమయ్యారు. ఇళ్లు నీటమునిగే అవకాశం ఉందన్న ఆందోళనతో సామగ్రిని ఆటోలు, ట్రాక్టర్లపై సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

సంతపాకలు, శబరి ఒడ్డు ప్రాంతాల్లోకి..

ఛత్తీస్‌గఢ్, ఒడిశాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకల ద్వారా వరదనీరు చేరడంతో చింతూరు ప్రాంతంలో శబరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. చింతూరులోని టోల్‌గేట్ సెంటర్‌తో పాటు సంతపాకలు, శబరిఒడ్డు ప్రాంతాల్లోని ఇళ్లలోకి క్రమక్రమంగా వరదనీరు ప్రవేశిస్తోంది. చింతూరు మెయిన్‌రోడ్ సెంటర్ నుంచి శబరిఒడ్డుకు వెళ్లే రహదారిపై వరదనీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సోకిలేరు, జల్లివారిగూడెం, కుయిగూరు, చంద్రవంక, చీకటివాగుల ఉధృతి రెండో రోజు కొనసాగింది. దీంతో చింతూరు, వీఆర్‌పురం మండలాల మధ్యతోపాటు, చింతూరు మండలంలోని సుమారు 25 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

- చింతూరు వంతెన వద్ద ఆదివారం రాత్రికి శబరినది నీటిమట్టం 40 అడుగులకు చేరుకుంది. కుయిగూరు వాగు నీరు జాతీయ రహదారి–326 మీదుగా ఉధృతి ప్రవహించడంతోపాటు కల్లేరు వద్ద రహదారి కోతకు గురికావడంతో ఆంధ్రా నుంచి ఒడిశాకు రాకపోకలు రెండోరోజూ కూడా కొనసాగలేదు.
- చింతూరు మండలం చట్టి వద్ద చంద్రవంక వాగు వరదనీరు విజయవాడ, జగ్దల్‌పూర్ జాతీయ రహదారి–30 పైకి చేరడంతో ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. వరదనీరు అడ్డంకిగా మారడంతో వందలాది వాహనాలు చట్టిలో నిలిచిపోయాయి.
- భారీ వర్షాల కారణంగా కలెక్టర్ జిల్లాలోని అన్ని పాఠశాలలకు రెండురోజులపాటు సెలవులు పొడిగించారు. దీంతో పలు ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఇళ్లకు బయలుదేరారు. వీఆర్ పురం మండలం సోములగూడెం ఆశ్రమ పాఠశాల, కూనవరం మండలం కోతులగుట్టలోని గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు చింతూరు మండలం చట్టి వద్ద జాతీయ రహదారిపైకి చేరిన వరద నీటిని దాటుకుని ఇళ్లకు వెళ్లారు.

పెరుగుతున్న శబరి ఉధృతి..

కూనవరం: గోదావరి నీటిమట్టం నెమ్మదిగా పెరుగుతుండగా శబరి నది ఉగ్రరూపం దాల్చుతోంది. శబరి వరద నీటికి కూనవరంలో సినిమా హాల్ సెంటర్‌లోని మెయిన్ రోడ్డు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. దీంతో రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉన్నందున ఆదివారం సాయంత్రం నుంచి ఇళ్లల్లోని సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కోతులగుట్ట పునరావాసర కేంద్రానికి తరలివెళ్తున్నారు. ముంపు ప్రభావిత ప్రజలకు కూడా ఇక్కడికి సుమారు 3 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న భీమవరం, భైరవపట్నం పునరావాస కేంద్రాలకు కూడా వెళ్తున్నారు.

- కూనవరం ఉదయభాస్కర్ కాలనీలో 30 కుటుంబాలను కోతులగుట్ట పునరావాస కేంద్రానికి తరలించినట్లు తహసీల్దార్ ఆర్‌వీ మురళీకృష్ణ తెలిపారు. కూనవరం, టేకులబోరు గ్రామాలకు 55 అడుగుల వరకు వరద ముంపు భయం లేకపోయినా ప్రధాన రహదారిపై సినిమాహాల్ సెంటర్ వరద ముంపునకు గురవుతుంది. దీనివల్ల కూనవరం, టేకులబోరుకు రాకపోకలు బంద్ అవుతాయి. అలాగే టేకులబోరు శివారులో పెదవాగు వద్ద ప్రధాన రోడ్డుపైకి వరదనీరు చేరడంతో టేకులబోరు నుంచి కోతులగుట్ట పునరావాస కేంద్రానికి రూట్ బంద్ అవుతుంది. ఈ భయంతోనే అనేక కుటుంబాలు స్వచ్ఛందంగా తరలివెళ్తున్నాయి.



చింతరేగుబల్లి -కన్నయిగుడెం రహదారిపైకి చేరిన వరద నీరు

జలదిగ్బంధంలో ఒడ్డుగూడెం..

వీఆర్‌పురం: మండలంలో ఒడ్డుగూడెం గ్రామాన్ని ఉభయ నదుల వరద నీరు చుట్టుముట్టడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ గ్రామంలో సుమారు 500 కుటుంబాలు ఉన్నాయి. వీరంతో ఇళ్లల్లోని సామగ్రితో సహా, వాహనాలను ట్రాక్టర్లు, వ్యాన్లు, ఆటోల్లో మూడు కిలోమీటర్ల దూరంలోని రేఖపల్లి పునరావాస కేంద్రానికి తరలిస్తున్నారు. శబరి వరద ఉధృతి పెరిగితే పరివాహక ప్రాంతంలోని రామవరం, ఏవీగూడెం, శబరిరాయగూడెం, లక్ష్మీనగరం, చొప్పల్లి, చింతరేగుపల్లి, తుష్టివారిగూడెం, వీఆర్‌పురం, సీతంపేట, శ్రీరామగిరి, చొక్కన్నపల్లి, కల్తునూరు, జీడిగుప్ప, ఇప్పూరు, పోచవరం, తుమ్మిలేరు, కొండెపూడి, కొల్లూరు గ్రామాలు కూడా ముంపునకు గురయ్యే పరిస్థితి ఉంది.

- శ్రీరామగిరి –సీతంపేట గ్రామాల మధ్య రహదారిపైకి వరదనీరు చేరింది. చింతరేగుబల్లి– కన్నాయిగూడెం, రామవరం –ఏవీగూడెం గ్రామాల వద్ద కూడా రహదారి పైకికూడా వరదనీరు చేరడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. **ప్రస్తుతం** పడవ ద్వారా గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రభుత్వ వసతి గృహాలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులను తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకువెళ్తున్నారు.



చింతూరు శబరిఒడ్డులో వరద భయంతో ఇంట్లో సామాన్లను తరలించేందుకు సిద్ధం చేస్తున్న బాధితులు

మొదటి ప్రమాద హెచ్చరికతో అప్రమత్తం

ఎటపాక: ఆదివారం ఉదయం భద్రాచలం వద్ద 37అడుగులకు చేరిన వరద క్రమేమి పెరిగి సాయంత్రం 6.51గంటలకు 43 అడుగులకు పెరిగింది. దీంతో భద్రాచలం ఆర్డీవో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడం అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైంది.

- గోదావరికి ఎగువన ఉన్న చర్ల తాలిపేరు ప్రాజెక్టు నుంచి వరద ఉదయం తగ్గుముఖం పట్టిన వరద ఉధృతి సాయంత్రానికి మళ్లీ పెరిగింది. ప్రాజెక్టు 25 గేట్లు పూర్తిగా ఎత్తి 80 క్యూసెక్కుల వరద నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. అయితే గంటకు పది వేల క్యూసెక్కులకు వరద పెరుగుతుండటంతో అర్ధరాత్రి లక్ష క్యూసెక్కులు విడుదల చేసే అవకాశం ఉంది.
- ఎగువున ఉన్న ప్రాణహిత, కడెం, ఇంద్రావతి, మేడిగడ్డ ప్రాజెక్టుల నుంచి కూడా వరదనీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో సోమవారం ఉదయానికి రెండవ ప్రమాదహెచ్చరిక స్థాయి 48అడుగులకు చేరవచ్చని కేంద్ర జలవనరుల సంఘం అధికారులు తెలిపారు. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమై లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



భద్రాచలం వద్ద 43 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం

చాలా ఖర్చవుతోంది



ఏటా వస్తున్న వరదల కారణంగా ఇళ్లు ఖాళీచేసి వెళ్లేందుకు ఆర్థికంగా చాలా ఖర్చవుతోంది. మాకు కూనవరంలో సొంతిల్లు వుండగా వరదల సమయంలో భద్రాచలంలో రూ.ఐదు వేలకు నాలుగు నెలల పాటు అద్దెకు ఇంటిని తీసుకుంటున్నా. వరద వస్తే సామాన్ల తరలింపు, వరద తగ్గితే తిరిగి సామాన్లు తెచ్చేందుకు కిరాయిలకు బోలెడు డబ్బులు అవుతున్నాయి.

– పొట్టాబత్తుల శ్రీనివాసరావు, కూనవరం

కాయకష్టం వరద పాలు



ఏడాదంతా ఎంతో కష్టపడి పనిచేసి సంపాదించిన సొమ్ములు వరదల సమయంలో కూర్చొని తినడం వల్ల ఇట్టే ఖర్చయిపోతున్నాయి. ఏటా వరదలకు ముంపునకు గురి కావడంతో ఇళ్లు కూలిపోతున్నాయి. అటవీ ప్రాంతాల్లో గుడారాలు వేసుకుని కాలం గడుపుతున్నాం. పోలవరం ప్యాకేజీ ఇచ్చి ఇక్కడినుంచి తరలించాలి.

– పట్టి చిరంజీవి, వీఆర్‌పురం మండలం

వర్షాకాలమంటేనే హడల్



వరదలు వచ్చినా రాకపోయినా వర్షాకాలమొస్తే చాలు ఇళ్లలో సామాన్లలన్నీ సర్దుకుని సురక్షిత ప్రాంతాలకు తరలి వెళుతున్నాం. చిరు వ్యాపారాలపై ఆధారపడిన తమకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. రహదారులు ముంపునకు గురికాక ముందే ఇళ్లను ఖాళీచేసి వెళ్లాలి లేకుంటే ఇళ్లతో పాటు సామాన్లు కూడా మునిగిపోతాయి.

– సయ్యద్ యూసఫ్, కూనవరం

తలకు మించిన భారం



గోదావరి ఒడ్డున తమ గ్రామం ఉన్నందున వరదల సమయంలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. వరద ముంచుతుందనే భయంతో ముందుగానే ఇళ్లను ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నాం. వరద అనంతరం ఇళ్లను శుభ్రం చేసుకునేందుకు కూలిపనులు చేసుకుని జీవించే మాకు తలకు మించిన భారమవుతోంది.

– బొర్రా శ్రీనివాస్, వడ్డిగూడెం, వీఆర్‌పురం మండలం



చింతూరులోని టోల్‌గేట్ సెంటర్‌లో ఇంటిలోకి చేరిన శబరి నది వరదనీరు



చింతూరు మండలం చట్టి వద్ద వరదనీటిలోంచి ఇళ్లకు వెళుతున్న నడిచివెళ్తున్న విద్యార్థులు



పడవల ద్వారా ఇళ్లకు వెళ్లేందుకు వరదనీటిలో బయలుదేరిన రామవరం విద్యార్థులు



వీఆర్‌పురం మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న శబరి నది



కూనవరం నుంచి మెరక ప్రదేశం భీమవరానికి సామగ్రితో తరలిస్తున్న బాధితులు



కుయిగూరు నుంచి పడవలో చింతూరు చేరుకున్న వరద బాధిత కుటుంబం



కూనవరంలో ట్రాక్టర్‌పై సురక్షిత ప్రాంతానికి సామాన్లను తరలిస్తున్న వరద బాధితులు

ప్రతి హామీని ‘కూటమి’ నెరవేర్చాల్సిందే

- ఎన్నికల వాగ్దానాలను విస్మరించిన చంద్రబాబు
- అసెంబ్లీ దృష్టికి గిరిజనుల సమస్యలు
- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు: ఎన్నికల వాగ్దానాల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాల్సిందేనని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ఈ మేరకు ఆదివారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ రేపటి నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గంలో గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తామని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అరకు బహిరంగ సభకు హాజరైన చంద్రబాబు జీవో నెంబర్ 3 పునరుద్ధరిస్తామని, గిరిజన నిరుద్యోగ అభ్యర్థుల కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహిస్తామని ఇచ్చిన హామీని నేడు విస్మరించారన్నారు. ఈ విషయాన్ని అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టానికి తూట్లు పొడుస్తూ యథేచ్ఛగా గిరిజనేతరులు నిర్మాణాలు కొనసాగిస్తున్నారని, చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారన్నారు. గిరిజనేతరుల ఇళ్లలో గిరిజనులు అద్దెకు ఉండాల్సిన పరిస్థితులు ఏర్పాడ్డాయన్నారు. మలేరియా, డెంగ్యూ, విష జ్వరాలు ప్రబలుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. గిరిజన గ్రామాల్లో ఎపిడమిక్ సీజన్ పూర్తయ్యేంతవరకు విస్తృతంగా వైద్యశిబిరాలు నిర్వహించాలని ఆయన అధికార యంత్రాంగాన్ని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

ఆలయ కమిటీపై రాజకీయం తగదు

పాడేరు మోదకొండమ్మ తల్లి ఆలయ కమిటీ విషయంలో రాద్ధాంతం సరైన పద్ధతి కాదని ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు .దశాబ్దాల తరబడి వస్తున్న ఆనవాయితీ మేరకు తాను ఎమ్మెల్యే అయిన తరువాత ఆలయ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గతానికి భిన్నంగా తాము అమ్మవారి ఆలయ ప్రతిష్టను పెంచేలా కార్యక్రమాలు చేపడామని తెలిపారు. గతంలో గిడ్డి ఈశ్వరి కూడా ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారని ఆ నిబంధనలు ఆమెకు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. మతిభ్రమించి మాట్లాడుతున్న ఆమెకు మంచి బుద్ధిని ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించారు. సమావేశంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలకు పునరావాసం

- విధులకు ప్రత్యేక సిబ్బంది హాజరుకావాల్సిందే
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: గోదావరి, శబరి వరదలకు సంబంధించి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు.ఆదివారం ఆయన అధికారులతో అత్యవసర టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చింతూరు డివిజన్‌లోని వరద ప్రభావిత నాలుగు మండలాల్లోని బాధిత ప్రజలను ఎత్తయిన ప్రదేశాలు, పునరావస కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఏ ఒక్కరికి ఎలాంటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన నిత్యావసరాలు, డీజిల్, పెట్రోల్, కి రోసిన్, ట్రాక్టర్లు, టార్చిలైట్లు, వంట కుక్‌లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ముంపునకు గురికాని గ్రామాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు, పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం పరస్పర సహకారంతో ప్రజలకు రక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి మండలంలోను కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ప్రత్యేక విధులకు కేటాయించిన అధికారులు,ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రియల్ టైం సమాచారాన్ని అందించాలని, ఎటువంటి విమర్శలకు తావులేకుండా పకడ్బందీగా సహాయక చర్యలు చేపట్టాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రక్షణ ఏర్పాట్లు సిద్ధం: ఎస్పీ అమిత్‌బర్దర్

వరద ప్రభావిత ప్రాంతాలలో సహాయక కార్యక్రమాలు, రక్షణ చర్యలను చేపడుతున్నామని ఎస్పీ అమిత్‌బర్దర్ తెలిపారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు చేరుకుంటున్నాయని, కమ్యూనికేషన్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. గర్భిణులు,బాలింతలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి వారిని ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని ఎస్పీ తెలిపారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం: ఐటీడీఏ పీవోలు

చింతూరు డివిజన్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామని చింతూరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు చైతన్య,సూరజ్ గనోరే తెలిపారు.సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల్లో 70 శాతం మంది ఇళ్లకు చేరుకున్నారని, మిగతా వారిని సురక్షిత ప్రాంతాల్లోని హాస్టళ్లకు తరలిస్తామన్నారు. శనివారం నాటికి ఐదు రహదారులు బ్లాక్ అయ్యాయని, ఈ సంఖ్య ఇంకా పెరిగే పరిస్థితి ఉందన్నారు. పాడేరు నుంచి పోలీసు బృందాలు చేరుకున్నాయని, అవసరమైన జనరేటర్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొబైల్ టవర్లు పనిచేస్తున్నాయని వారు తెలిపారు.

క్లుప్తంగా

నేటి నుంచి శిక్ష సప్తాహ్



డీఈవో బ్రహ్మాజీరావు

సాక్షి,పాడేరు: కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం(ఎన్‌ఈపీ 2020) ప్రవేశ పెట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 22 నుంచి 28వ తేది వరకు శిక్ష సప్తాహ్ ఉత్సవాలను (వారోత్సవాలు) నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యా శాఖాధికారి పి.బ్రహ్మాజీరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన విద్యా విధానంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులకు సమగ్రంగా అవగాహన కల్పిస్తామన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఈనెల 22న బోధన సామగ్రి ప్రదర్శన, 23న పునాది అభ్యసనం, గణితంలోని సంఖ్యా శాస్త్రం నైపుణ్యాల అభివృద్ధిపై అవగాహన, 24న విద్యార్థులకు క్రీడాంశాలపై పోటీలు నిర్వహణ, 25న సాంస్కృతిక దినోత్సవం, 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ దినోత్సవం, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవాలను విజయవంతంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

వై.రామవరం: గుర్తేడు పీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బంది నిర్లక్ష్యం వలనే తన భార్య కుమారి(25) మృతి చెందినట్టు పాతకోట పంచాయతీ కొప్పులకోట గ్రామ గిరిజనుడు గుంట రత్నబాబు ఆరోపించారు. ఆయన తెలియజేసిన వివరాలివి. ఈనెల 19న తన భార్యకు పురిటినొప్పులు రావడంతో అంబులెన్స్ కోసం గుర్తేడు పీహెచ్‌సీకు వెళ్లి వైద్యాధికారిని అడిగామన్నారు. ఆయన డ్రైవర్ దగ్గరకు వెళ్లి అడగమని చెప్పగా, డ్రైవర్ సేనాపతిని కోరగా వాహనంలో ఆయిల్ వేయిస్తే వస్తానని చెప్పాడన్నారు. అయితే తన వద్ద డబ్బులు లేవని చెప్పగా, అంబులెన్స్ సేవలు అందవని డ్రైవర్ చెప్పినట్టు తెలిపారు. గత్యంతరం లేక ఇంటికి తిరిగి వెళ్లగా రాత్రి తన భార్యకు ప్రసవం అవడంతో మగబిడ్డ జన్మించిందని, అయితే ఆమె మృతి చెందినట్టు విచారం వ్యక్తం చేశారు.తన భార్య కుమారి ఆసుపత్రి వైద్యాధికారి, డ్రైవర్ నిర్లక్ష్యం వలనే చనిపోయిందని ఆరోపించారు. వారిపై తగు చర్యలు తీసుకుని తనకు న్యాయం చేకూర్చాలని ఆయన కోరారు. ఈ విషయంపై వైద్యాధికారి జగదీష్ మాట్లాడుతూ రత్నబాబు అనే వ్యక్తి తన వద్దకు రాలేదని, అంబులెన్స్ డ్రైవర్ సేనాపతితో మాట్లాడి వెళ్లిపోయినట్టు తెలిసిందన్నారు. విషయం తెలుసుకొని వైద్య సిబ్బందిని గ్రామానికి వెళ్లి గర్భిణిని ఆస్పత్రికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించినా, ఆమె కుటుంబీకులు నిరాకరించినట్టు చెప్పారు. కాగా అంబులెన్స్ డ్రైవర్ తీరుపై అధికారులకు రిపోర్ట్ చేశానని, ఆదివారం నివేదికను పంపినట్టు తెలిపారు.

నమో నారసింహా...

- ముగిసిన గిరి ప్రదక్షిణ
- జనసంద్రంగా మారిన సింహగిరి
- భక్తులతో కిటకిటలాడిన పాతగోశాల
- విశేషంగా ఆలయ ప్రదక్షిణలు
- 9 లక్షల మంది గిరి ప్రదక్షిణ చేశారని అంచనా
- 60 వేల మంది దర్శనం



వర్షంలో తడుస్తూ గిరి ప్రదక్షిణకు..



గిరి ప్రదక్షిణ చేసి తొలిపావంచా వద్దకు వెళ్తున్న భక్తులతో కిక్కిరిసిన అడవివరం ప్రధాన రహదారి

సింహాచలం: శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి స్మరిస్తూ శనివారం లక్షలాదిమంది భక్తులు చేపట్టిన సింహగిరి ప్రదక్షిణ ఆదివారంతో ముగిసింది. సింహాచలంలోని తొలిపావంచా వద్ద ప్రదక్షిణ ప్రారంభించిన భక్తులు సింహగిరి చుట్టూ ఉన్న 32 కిలోమీటర్ల ప్రదక్షిణ చేసి తిరిగి తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. స్వామి సన్నిధిలో మళ్లీ కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణ ముగించారు. పలువురు భక్తులు స్వామి దర్శనానికి మెట్లమార్గంలో సింహగిరికి తరలివెళ్లారు. ఆదివారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురుస్తున్నా భక్తులు స్వామి దర్శనానికి బారులుదీరారు.

తెల్లవారుజామున 3.30గంటల నుంచే దర్శనాలు

గిరి ప్రదక్షిణ చేసి వచ్చిన భక్తులకు ఆదివారం తెల్లవారుజామున 3.30గంటల నుంచే స్వామివారి దర్శనాలు కల్పించారు. ముందుగా ఉదయం 5.30 గంటల నుంచి దర్శనాలు కల్పిస్తామని దేవస్థానం అధికారులు ప్రకటించారు. కానీ భక్తుల సౌకర్యార్థం తెల్లవారుజామున 3.30 గంటల నుంచే దర్శనాలు అందజేయడం విశేషం. సాయంత్రం 4 గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు అందజేశారు. భక్తులకు త్వరితగతిన దర్శనాలు అందించేందుకు ఉచిత దర్శనం క్యూతో పాటు రూ100,రూ.300 దర్శన టికెట్ల క్యూల్లో కూడా భక్తులను ఉచితంగా పంపించారు. ఆలయ నీలాద్రిగుమ్మం దగ్గర నుంచే లఘు దర్శనం కల్పించారు. అంతరాలయ దర్శనం బంద్ చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపే దాదాపు భక్తుల దర్శనాలు పూర్తయ్యాయి.

విశేషంగా ఆలయ ప్రదక్షిణలు

ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని సింహగిరిపై ఆలయ ప్రదక్షిణలు ఘనంగా జరిగాయు. తెల్లవారుజామున 3గంటల నుంచి భక్తులను ఆలయ ప్రదక్షిణలకు అనుమతించారు. అప్పటికే సింహగిరికి చేరుకున్న భక్తులు ఆలయ బాహ్య ప్రాకారం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

సింహగిరిపై జన జాతర

శనివారం 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేసి స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతోను, మరో పక్క ఆలయ ప్రదక్షిణలకు వచ్చిన భక్తులతోను ఆదివారం సింహగిరి జనజాతరగా మారింది. భక్తులతో కిటకిటలాడింది.

9 లక్షలు మంది గిరి ప్రదక్షిణ

శనివారం 32 కిలోమీటర్ల మేర 9 లక్షల మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేసినట్టు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. అలాగే ఆదివారం 60 వేల మంది స్వామివారి దర్శనానికి వచ్చినట్టు, సుమారు 5వేల మంది ఆలయ ప్రదక్షిణల్లో పాల్గొన్నట్టు అంచనా వేశారు.

- కొండదిగువ పాత గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం వరకు ఉన్న మార్గం భక్తులతో కిక్కిరిసింది. ఒక పక్క గిరి ప్రదక్షిణ పూర్తిచేసి తొలిపావంచాకు చేరుకునే భక్తులతోను, మరోపక్క గిరి ప్రదక్షిణ పూర్తిచేసుకుని ఇళ్లకు చేరుకునే భక్తులతోను రద్దీ నెలకుంది.
- గిరి ప్రదక్షి ముగించుకుని తిరిగి కొబ్బరి కాయలు కొట్టే భక్తులతో తొలిపాంచా కిటకిటలాడింది.
- మెట్లమార్గంలో కేవలం సింహగిరికి వెళ్లే భక్తులనే అనుమతించారు. కొండదిగువకి మెట్లమార్గంలో అనుమతించలేదు.
- కొండదిగువకి భక్తులను చేరవేసేందుకు దేవస్థానం 45 ఉచిత బస్సులను ఏర్పాటు చేసింది.
- 32 కిలోమీటర్లు చేసి గిరి ప్రదక్షిణ చేసి స్వామివారి దర్శనానికి సింహగిరికి వచ్చిన భక్తులను ఆలయ ఉత్తరరాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన దిగువ నుంచి ఆలయంలోకి, దర్శనం చేసుకుని బయటకు వచ్చే భక్తులను దక్షిణ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన దిగువ నుంచి పంపించారు.
- ఆలయ నీలాద్రి గుమ్మం వద్ద నాలుగు లైన్లు ఏర్పాటు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు.
- సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయం వద్ద, సింహగిరి బస్టాండ్‌లోను అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. వైద్య సేవలు అందించారు. మందులు పంపిణీ చేశారు.
- సింహగిరిపైన, కొండదిగువ పెద్ద ఎత్తున పోలీసులు బందోబస్తు నిర్వహించారు.
- ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద నాలుగు లైన్లలో భక్తులు వెళ్లి దర్శనం చేసుకునేలా ర్యాంపులు ఏర్పాటు చేశారు.
- భక్తులు కొట్టిన కొబ్బరికాయలతో తొలిపావంచా వద్ద పెద్ద ఎత్తున కుప్ప ఏర్పడింది. ఎప్పటికప్పుడు కాంట్రాక్టర్ తరలించేలా చర్యలు చేపట్టారు.
- సింహగిరిపై అన్నప్రసాద భవనంలో నిర్విరామంగా దద్దోజనం, పొంగళి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.
- కొండదిగువ పాతగోశాల జంక్షన్ వద్ద తీవ్ర రద్దీ నెలకుంది. ప్రదక్షిణ ముగించుకున్న భక్తులంతా పాతగోశాల దంక్షన్‌లో ఆర్టీసి బస్సులు ఎక్కారు. ఆర్టీసీ బస్సులన్నీ భక్తులతో రద్దీగా మారాయి.
- తొలిపావంచా వద్ద భక్తులకోసం ఏర్పాటు చేసిన స్టాల్,క్యూలపై వేసిన షామియానాలు వర్షానికి కూలిపోయాయి.



ఈదురుగాలులకు కూలిపోయిన టెంట్లు

గర్భిణికి తప్పిన ప్రాణాపాయం

భారీ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించినా అత్యవసర సేవల సిబ్బంది వృత్తిని దైవంగా భావించి పనిచేస్తూ ప్రాణాలను కాపాడుతున్నారు. విపత్కర పరిస్థితుల్లోనూ సేవలందించి బాసటగా నిలుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

- విపత్కర పరిస్థితుల్లో ఆస్పత్రికి తరలించిన 108 పైలట్
- పలువురి అభినందన

కొయ్యూరు: మండలంలోని బూదరాళ్ల పంచాయతీ కన్నవరంలో పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణి నందినిని విపత్కర పరిస్థితుల్లో ఆస్పత్రికి తరలించి ప్రాణాపాయ పరిస్థితుల నుంచి నుంచి 108 పైలట్ కాపాడారు. ఆమెకు ఆదివారం ఉదయం పురిటినొప్పులు రావడంతో కొయ్యూరులోని 108కు కుటుంబసభ్యులు సమాచారం అందించారు. వెంటనే వాహనం కన్నవరం బయలుదేరింది. మార్గంమధ్యంలోని జువ్విరేగుల వద్దకు వచ్చేసరికి రోడ్డుకు అడ్డంగా చెట్టుపడిపోయింది. వెంటనే సమయస్ఫూర్తితో వ్యవహరించిన 108 పైలట్ వాహనాన్ని వెనక్కి తిప్పి దొడ్డవరం, నూకరాయితోట మీదుగా బాలరేవుల చేరుకుంది. వేరేమార్గంలో వస్తున్న విషయాన్ని గర్భిణి కుటుంబ సభ్యులకు పైలట్ తెలియజేశాడు. దీంతో వారు బాలరేవులకు ప్రైవేట్ వాహనంలో తీసుకువచ్చారు. వెంటనే ఆమెను 108లోకి ఎక్కించి అత్యవసర వైద్యం అందిస్తూ రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో చేర్పించారు. కొద్దిసేపటికే ఆమె ప్రసవించింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు. వారిని పలువురు అభినందించారు.

వర్షాలకు 140 గ్రామాల్లో విద్యుత్ అంతరాయం

- త్వరితగతిన పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థని సరి చేస్తున్న ఈపీడీసీఎల్ సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం : వర్షాలు, వరదల ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఈ చర్యల్లో భాగంగా అన్ని సెక్షన్ కార్యాలయాల్లో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన సామగ్రి, సిబ్బందిని అందుబాటులో ఉంచడం ద్వారా పునరుద్ధరణ చర్యలను త్వరితగతిన చేపట్టగలిగామని వివరించారు. వర్షాల కారణంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 5 సర్కిళ్లలోని 140 గ్రామాల్లో 47,999 సర్వీసు కనెక్షన్లకు విద్యుత్తు అంతరాయం ఏర్పడటంతో పాటు పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయనీ, విద్యుత్ తీగలు తెగిపడటం, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయని, వీటన్నింటినీ సరి చేస్తున్నట్లు వివరించారు. వర్షం తగ్గిన ప్రాంతాల్లో మిగిలిన వాటిని సోమవారం నాటికి ప్రత్యేక బృందాలతో పూర్తి స్థాయిలో పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని ఎస్‌ఈలకు ఆదేశాలిచ్చామని సీఎండీ వివరించారు. ఏ సమస్య తలెత్తినా వినియోగదారులు కార్పొరేట్ ఆఫీసు 9440816373, విశాఖపట్నం 7382299975 సెల్ నంబర్‌కు తెలియజేయాలని వినియోగదారులకు సీఎండీ విజ్ఞప్తి చేశారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



మండల సహాయ వ్యవసాయ సంచాలకురాలు సావిత్రి

అడ్డతీగల: అధిక వర్షాలధాటికి వరి పంట రక్షణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అడ్డతీగల సహాయ వ్యవసాయ సంచాలకురాలు కంకిపాటి సావిత్రి తెలిపారు. ప్రస్తుతం అల్పపీడనం వల్ల కురుస్తున్న వర్షాలకు వివిధ దశల్లో ఉన్న వరి పంట ముంపునకు గురి అవుతుందన్నారు. వర్షాలకు నారుమడిలో విత్తనం చల్లిన రెండు మూడు రోజుల్లో తరువాత మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. వీలైనంత త్వరగా నీరు బయటకు తీయాలన్నారు. ఈ దశలో ముంపును తట్టుకునే భీమ(ఎంటీయూ-1140) రకం విత్తనం 10 రోజుల వరకూ నీటి ముంపును తట్టుకుంటుందన్నారు. విత్తనం వేసిన తరువాత ఏడు నుంచి 30 రోజుల వ్యవధిలో నారు ఐదు రోజుల కన్నా ఎక్కువ మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఎంటీయూ-1232 రకం విత్తిన 15 నుంచి 70 రోజుల వరకూ ముంపుని తట్టుకుంటుందన్నారు. మునిగిన నారుమడిలో నుంచి ఐదు రోజులలోగా నీరు పూర్తిగా బయటకు తీసి వేసిన తరువాత ఐదు సెంట్లు నారుమడికి ఒక కిలో యూరియా ఒక కిలో పొటాష్ వేసుకోవాలన్నారు. ఒక గ్రాము కార్బెన్డిజమ్ లేదా రెండు గ్రాములు కార్బెన్డిజమ్ మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పిలకల దశలో సాధారణ రకాలు ఐదు రోజుల వరకూ నీట మునిగినా బతికే అవకాశం ఉందన్నారు. ముంపును తట్టుకునే రకాలైన ఎంటీయూ-1140, ఎంటీయూ-1172, ఎంటీయూ-1223,ఎంటీయూ-1064, పీఏల్‌ఏ-1100 రకాలు వారం రోజుల పాటు ముంపును తట్టుకుంటుందన్నారు. ఆకులు పైకి కనిపిస్తూ 30 లేదా 40 సెంటీమీటర్లు నీరు నిలబడే మధ్యస్థ ముంపునకు గురయ్యే పల్లపు ప్రాంతాల్లో ముంపుని తట్టుకుంటాయన్నారు. పిలక దశలో వరి పంట మునిగితే నీరు బయటకు పారిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా మరో 20 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని సూచించారు.

ప్రమాదకర వాగులతో అప్రమత్తం



ఉధృతంగా ప్రవాహిస్తున్న కొండవాగులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

రంపచోడవరం: ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన ప్రజలు వాగులు దాటేటప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్ చెప్పారు. ఆదివారం రంపచోడవరం మండలం ఐ.పోలవరము సీతబెల్లి కాలువ, గంగవరం మండలం నెల్లిపూడి కాలువ, అడ్డతీగల మండలం పైడి పుట్ట కాలువలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు పడుతున్నాయని వాగులు దాటేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా ముఖ్యమైన కాలువల దగ్గర రెవెన్యూ సిబ్బంది మండల పరిషత్ సిబ్బంది, పోలీసులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కాలువలు పొంగేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలను కాలువ దాటనీయవద్దని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. వాగుల ఉధృతి తగ్గే వరకు కాలువలు ప్రజలు దాటవద్దన్నారు. రంపచోడవరం మండలం పోలవరం కాలువలో ఓ వ్యక్తి కాలువలో దిగుతుండగా నిలిపి పోలీసులకు అప్పగించారు. భారీ వర్షాల కారణంగా రోడ్లపై పడిపోయిన చెట్లను తొలగించేందుకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత ఇంజనీర్లు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్లు సత్య సులోచన, నాగమణి, డిప్యూటీ తహసీల్దార్లు బి.రాజు, వీరభద్రరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదస్థాయికి జలాశయాలు



వరద నీటితో పూర్తిగా నిండిన డుడుమ జలాశయం



ప్రమాదస్థాయికి చేరుకున్న సీలేరు జలాశయం

- డుడుమకు పోటెత్తిన వరదనీరు
- బలిమెలకు 2 వేల క్యూసెక్కులు విడుదల

ముంచంగిపుట్టు: ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే ప్రధాన డుడుమ జలశయానికి వరద నీరు పోటెత్తింది. సరిహద్దులో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయంలో నీటి నిల్వ క్రమేపీ పెరగడంతో ప్రమాదస్థాయికి చేరుకుంది. డుడుమ జలాశయ నీటి సామర్థ్యం 2,590 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 2,589.40 అడుగులకు నీటిమట్టం చేరింది. దీంతో 6,7 నంబర్ల గేట్లును ఎత్తి దిగువున ఉన్న బలిమెల జలాశయానికి రెండు వేల క్యూసెక్కుల నీటిని ఆదివారం నుంచి సాయంత్రం వరకు విడుదల చేశారు. ఇన్‌ఫ్లో సాయంత్రానికి తగ్గడంతో 7వ నెంబర్ గేటును మూసివేసి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం సీలేరు జలాశయం నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరుకోవడంతో ఏ క్షణమైనా జలాశయం గేట్లు ఎత్తివేయడానికి జెన్‌కో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఐదు రోజులుగా పడుతున్న వర్షాలకు ప్రాజెక్ట్ నీటిమట్టం 1355 అడుగులకు చేరుకుంది. సీలేరు జలాశయంకు ఎగువప్రాంతాలైన పిల్లిగెడ్డ, ఐస్‌గెడ్డ నుంచి అధికసంఖ్యలో ఇన్‌ఫ్లో వస్తోంది. మరో మూడు అడుగులు నీటిమట్టం పెరిగితే గేట్లు ఎత్తడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం ఈఈ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏఈఈలు సీహెచ్ సురేష్, కేఎస్ అనుదీప్ జలాశయం వద్ద గేట్లు, జనరేటర్ పనితీరును పరిశీలించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఈఈ ప్రభాకరరావు మాట్లాడుతూ పిల్లిగెడ్డ, ఐస్‌గెడ్డల నుంచి మూడు వేల క్యూసెక్కులు నీటి నిల్వలు చేరుతున్నాయని, మరో మూడు అడుగులు నీటిమట్టం పెరిగితే జలాశయం గేట్లు ఎత్తివేస్తామని తెలిపారు. ఇందుకోసం దిగువ ప్రాంతాల్లో ఉన్న గ్రామాల వారిని అప్రమత్తం చేశామని తెలిపారు. ఈ విషయాన్ని జీకేవీధి తహసీల్దార్, సీలేరు పోలీస్‌స్టేషన్‌తోపాటు సీలేరు, గుంటవాడ సర్పంచ్‌లకు తెలియజేశామని ఈఈ తెలిపారు.

రెండో రైల్వే లైన్ పనులు నిలిపివేయాలని వినతి



డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘాల నాయకులు

అనంతగిరి: బొర్రా గుహలపై నుంచి రెండో ట్రాక్ వేసేందుకు రైల్వేశాఖ సన్నహాలు చేస్తుందని, దీంతో బొర్రాగుహలు కూలిపోయే ప్రమాదం ఉందని, ట్రాక్ మార్పే విధంగా చర్యలు చేపట్టాలని, ఆదివారం గుహలను సందర్శించిన రైల్వే డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్‌కు స్థానిక మోటార్ యూనియన్ అధ్యక్షుడు శ్యామ్, ఏపీటీడీసీ ఉద్యోగులు రాజు, సోమేష్, రాము, వినతిపత్రాన్ని అందజేశారు. ఇప్పటికే గుహలపై నుంచి మొదటి ట్రాక్‌లైన్ ఉందని, బంజో డబుల్‌గూడ్స్ రైలు వెళ్తున్నప్పుడు గుహల లోపల మట్టిపెల్లులు జారిపడుతున్నాయని, డబ్లింగ్ పనులు చేపడితే గుహలు మూసుకుపోయే ప్రమాదం ఉందని వివరించారు. బొర్రాగుహల పైనే లక్షలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని, రెండో ట్రాక్‌లైన్ గుహలు 40 మీటర్ల దూరంలోని గుహలకు ఎటువంటి ముప్పు ఉండదని వివరించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు.

రైల్వే ట్రాక్‌పై కూలిన చెట్టు



రైల్వే ట్రాక్‌పై విరిగిపడిన చెట్టు

అనంతగిరి : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొత్తవలస-కిరండూల్ రైల్వే లైన్‌లోని బొర్రా-కరకవలస మధ్య 74/2 కిలోమీటర్ రైల్వే ట్రాక్‌పై ఆదివారం రాత్రి 8.20 గంటలకు భారీ వృక్షం కూలింది.ఈ సమాచారం తెలుసుకున్న రైల్వే ఇంజనీర్లు,ఇతర సిబ్బంది హుటాహుటిన ట్రాక్ ప్రాంతానికి చేరుకుని రాత్రి 9.45 గంటలకు పూర్తిగా చెట్టును తొలగించారు. ఆ సమయంలో రైళ్ల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

సైబర్ నేరగాళ్ల చేతిలో గిరిజనుడు మోసం

– ఫోన్‌లో వివరాలు తెలుసుకొని ..
బాధితుడి ఖాతాలో నిధులు ఖాళీ



బాధితుడు మనోహర్

గూడెంకొత్తవీధి: సైబర్ నేరగాళ్ల మోసాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. వీరిబారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ పోలీసు యంత్రాంగం చెపుతున్నా అవి పూర్తి స్థాయిలో గిరిజన ప్రాంతాలకు చేరకపోవడంతో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. తాజాగా అల్లూరి జిల్లా గూడెంకొత్తవీధి మండలం మొండిగెడ్డ పంచాయతీ తోటలగొంది గ్రామానికి చెందిన కందుల మనోహర్ అనే గిరిజనుడు సైబర్ మాయగాళ్ల వలలో పడి మోసపోయాడు. ఇతను అందించిన వివరాల ప్రకారం ఈనెల 17న తనకు ఫోన్ వచ్చిందన్నారు. హిందీలో మాట్లాడుతూ తన బ్యాంకు ఖతా వివరాలు అడగండంతో తాను వివరాలు వెల్లడించినట్టు తెలిపారు. తరువాత చూస్తే తన యనియన్ బ్యాంకు ఖాతానుంచి తనకు తెలియకుండా, ప్రమేయం లేకుండా నేరుగా రూ.9,200 నగదు విత్‌డ్రా అయినట్టు తమ సెల్‌ఫోన్‌కు సందేశం వచ్చిందని వివరించాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు బాధితుడు మనోహర్ తెలిపారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

- హాజరు పట్టీలో 20న సంతకం లేకపోవడంపై ఆగ్రహం
- ఎంపీహెచ్‌ఈఓ, హెచ్‌వీలకు షోకాజ్ నోటీసు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా

పెదబయలు: మండలంలోని రూడకోట పీహెచ్‌సీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అయితే ఈ నెల 20న ఎంపీహెచ్‌ఈవో వంతాల బింగురాజు, హెచ్‌వీ పి.కాసులమ్మ హాజరు రిజిష్టర్‌లో సంతకాలు పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. షోకాజ్ నోటీసు జారీ చేయనున్నట్టు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో రోజు వారి ఓపీ, ప్రసవాలు, మలేరియా ఇతర వ్యాధులకు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు వైద్య సేవలపై ఆరా తీశారు. జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాల వల్ల అత్యవసర పరిస్థితులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు ఉన్నారని తప్పని సరిగా అందుబాటులో ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది ఉన్నారు.

శాకాంబరి అలంకరణకు ఘనంగా ఏర్పాట్లు

- నేడు దర్శనమివ్వనున్న రాజరాజేశ్వరి సమేత నీలకంఠేశ్వరస్వామి వారు

సాక్షి,పాడేరు: పట్టణంలోని రాజరాజేశ్వరి సమేత నీలకంఠేశ్వరస్వామి విగ్రహాలకు సోమవారం శాకాంబరి అలంకరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో ఆలయ ఆధ్యాత్మిక కమిటీ, భక్తులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 5గంటల నుంచే శాకాంబరి అలంకరణలో రాజరాజేశ్వరి సమేత నీలకంఠేశ్వరస్వామి వారు భక్తులకు దర్శనమిస్తారని వారు తెలిపారు.